# సైంటిస్ట్ స్వగతం - గతం

పార్కులో కూర్చున్నాను. ఎదురుగా తోట వారి చెట్లకు నీళ్ళు పోస్తున్నాడు. క్రికెట్ మాచ్ కామెంటరీ వినపడుతోంది. దూరంగా పిల్లలు ఇసుకలో ఆడుకొంటున్నారు. వాతావరణం కొంచెం చల్లగా వుంది.

ఒక వ్యక్తి నేను కూర్చున్న బెంచీ దగ్గరకు వచ్చాడు. సందేహిస్తూ నిలబడ్డాడు. చుట్టూ ఎక్కడా బెంచీ లేదు. ఒకటో, అరో వున్నా దాని మీద ఖాళీ లేదు.

"ఏమండీ, నేనూ కూర్చో వచ్చునా?" అన్నాడా వ్యక్తి.

నేను తల పైకెత్తాను. మాసిన గడ్డం, కొంచెం చిరిగిన కోటు, ఒక మాసిన పాంటు, కొంచెం ముదురుగా వున్న ముఖం: మొహంలో ఏదో విచారం తాండవిస్తోంది.

"కూర్చోండి. దానికేం. పార్కు పబ్లిక్ — సొమ్ముగదా?" అన్నాను. అయినా నా మనసులో కొంచెం కష్టంగానే వుంది.

నెమ్మదిగా కూర్చున్నాడు. కొంచెం సేపు నిశ్శబ్దం. "వాతావరణం చాలా బాగుంది" అన్నాడా వ్యక్తి.

నేను తల పంకించాను. "అయినా కొంచెం చలిగా వుంది లెండి."

"ఏదయినా ఇలాంటి పెద్ద పట్టణంలో, రోజంతా చాకిరీ చేసి చివరికి ఇలాటి వాతావరణంలోకి అడుగిడగానే హృదయానికెంతో ఆనందము!" అతనో నిట్టూర్పు విడిచాడు.

"మనకెన్నో ఆశయాలుంటాయి. చివరకు మన చేతిలో అమూల్య వస్తువులున్నా, మనం జీవితంలో నెగ్గలేక పోతాం!"

నేను ఆశ్చర్యంగా అతని వేపు చూశాను.— "మీ అభిప్రాయం పొరబాటు. చేతిలో అమూల్య వస్తువులుంటే డబ్బు చేసుకోవచ్చు. మన ఆశయాల్ని సాధించ వచ్చు."

అతను అదో విధంగా నావేపు చూశాడు.— "మీరలా అనుకుంటున్నారు. కానీ—నాజీవితం—నాజీవితం,—నా ఆశయాలు" అతను కొంత సేపు ఆగాడు. అతని కళ్ళలో నీళ్ళు వచ్చినయి. అతని ముఖం నిండా దుఃఖం., నిరాశ, ఆర్ద్రత తాండవిస్తున్నాయి. నాకు కూడా జాలి వేసింది.

"ఏమండీ! అలా అయ్యారు! మీ జీవితం—" ప్రశ్నించాను నేను.

"నా జీవితం నాశనమయింది. నన్నెవ్వరూ నమ్మరు. నన్నందరూ అనుమానిస్తారు. నా ఆశయాలు, నావజ్రాలు అన్నీ నాశనం కావలసిందేనా" అతను తన కళ్ళ నీళ్ళను తుడుచుకున్నాడు.

"మీరు—. ఏం చేస్తారు." ప్రశ్నించాను నేను. "నేను వజ్రాలు తయారు చేస్తాను. సమాధానం వచ్చింది.

"అయితే మీకిప్పుడు ఏం వుద్యోగం లేదా?"

"వుద్యోగం కోసం కాదు నాజీవితం నాశనమయింది. నన్నందరూ అనుమానిస్తారు. నన్ను నమ్మరు. ఆ అపనమ్మకమే నన్నింత హీనస్థితికి తెచ్చింది. అతను తన కోటు లోపలికి చేయినిచ్చి ఒక చిన్న తోలు సంచీ తీసి, అందులోంచి ఒక గోధుమ రంగు గులకరాయి తీసి నా చేతిచ్చాడు.

"ఇది ఏమిటో మీరు తెలుసుకో గలరా?"

నేను దాన్ని ఛేతిలోకి తీసుకున్నాను. నాకు లేబలేటరీలోని చిన్న వజ్రం జ్ఞప్తికి వచ్చింది. అది వజ్రంలా కనిపిస్తోంది. లోపల రంగురంగుల గీతలు లీలగా కన్పిస్తున్నాయి. ఇది సాన బెట్టని వజ్రమై వుండవచ్చు. నా అనుమాన నివృత్తికై లైటు దగ్గర కెళ్ళి వాచిగ్లాసుమీద ఒక్క గీత గీసాను. వాచీ గ్లాసుమీద లోతుగా తెల్లటి గీత పడింది. నేను ఆశ్చర్యపోయాను. ఇది నిజమయిన వజ్రం కావచ్చు. అలాగే అయితే, ఇంత పెద్ద వజ్రం, నాబొటన వేలికంటే పెద్దది కొన్ని కోట్ల రూపాయల విలువ గలది అవుతుంది.

"నేను దాన్ని తయారు చేశాను." అతని గొంతులో ఆశ ధ్వనించింది. ఆ వజ్రాన్ని తీసి తన తోలు సంచీలో కట్టి లోపల వేసుకున్నాడు. నాభుజం తట్టి, "ఇదిగో, ఈవజ్రాన్ని నీకు వెయ్యి రూపాయలకమ్ముతాను." అన్నాడు.

నాలో అనుమానం ప్రవేశించింది ఇంతకూ ఇది నిజమయిన వజ్రమా కాదా? ఏమో" అతను నాకళ్ళలోకి ఆత్రుతగా చూస్తున్నాడు. నేను అతని కళ్ళలోకి అనుమానంగా చూస్తున్నాను.

"ఇదెక్కడిది నీకు?" నా గొంతులోనుంచి నాకు తెలియకుండానే ఆమాటలు వెలువడ్డాయి. అతని ముఖం పేలవమయింది. "అవును!"— మీరు నమ్మరు! నన్ను నమ్మరు. అంతే!" తల అటు ఇటూ బాధగా త్రిప్పాడు. తల పట్టుకున్నాడు.

"నేను ఆ వజ్రాల్ని తయారు చేశాను." నూతిలో నుండి వెలువడిన మాదిరి వున్నాయి ఆ మాటలు.

నాకూ కృత్రిమ వజ్రాలు చేస్తారని తెలుసు. బొగ్గును కరిగే ఇనుములో వేస్తే వజ్రమవుతుంది. కాని అలా పరమాణువుల మార్పు సంభవించేటప్పుడు చాలా భాగం నాశనమయి, ఇసుక రేణువంత వజ్రం తయారవుతుంది. కానీ ఇంత పెద్ద వజ్రాన్ని ఇతనెలా చేశాడు. నాబుర్రలో అనుమానపు అపనమ్మకపు పురుగులు ప్రవేశించి తొలువ సాగాయి! నేను తల అడ్డంగా తిప్పాను.

"వజ్రాలు—" అతను నావేపు పరీక్షగా చూశాడు. 'తయారుచేస్తారు— సైంటిస్టులు, లేబరేటరీలో—కాగేఇనుములో రాక్షసి బొగ్గు వేసి వజ్రాలు చేస్తారు. ఆభరణాలుగా పనికిరావు. నల్లగా, చిన్నగా, ప్రకాశ హీనంగా వుంటాయి. ఈవజ్రాన్ని తయారు చేశానంటే నమ్మరు. చెబుతున్నాను ఈ వజ్రపు తయారు గురించి, అతను కొంత సేపు వూరుకున్నాడు.

నేను అతనివేపు కుతూహలంగా చూశాను.

"నాకు పదిహేడు సంవత్సరాల వయస్సు వచ్చేసరికి నాకు వజ్రాల కంపెనీలో పనిచేసిన అనుభవం వల్ల దానిలోని విషయాలు, సూక్ష్మాలు క్షుణ్ణంగా తెలిసిపోయాయి. వజ్రాల తయారీకి నా జీవితాన్ని అంకితం చేయాలనుకున్నాను. నాప్రియత్నాన్ని ప్రారంభించాను. కానీ — ఒక వేళ నేను కనుబడితే — అది అందరికీ తెలిస్తే, వజ్రాలు, బొగ్గుల మాదిరి ఎక్కడంటే అక్కడ అమ్ముతారు. వాటి విలువ పోతుంది. అందుకని నా రహస్యాలు ఎవరికీ చెప్పగూడదు." అతను కొంచెం ఆగాడు. వుత్సాహంగా, "ఆపద్ధతిని కనిపెట్టాను. కృత్రిమంగా వజ్రాలు తయారుచేసే పద్ధతి కనిపెట్టాను. ప్రపంచంలో ఎవరూ కనిపెట్టని విధానాన్ని నేను కనిపెట్టాను". అన్నాడు. నాదగ్గర వెయ్యి రూపాయలు సమకూడాయి. ఒక సంవత్సరం వరకు నా పరిశోధనలు కొనసాగించడానికి ఆ డబ్బు చాలు. ముందుగా కలకత్తాలో ప్రొఫెసర్ మేఘనాధబెనర్జీ దగ్గర రీసెర్చి అప్రెంటిస్‌గా చేరాను. ఒక చిన్న రూమ్‌లో నేను ప్రత్యేకంగా చిన్న లేబరేటరీ పెట్టుకుని నా పరిశోధనలు ప్రారంభించాను. ఎవరికీ నావిషయం, నాపరిశోధన విషయాలు చెప్పలేదో వారు నాపరిశోధనలు కనుగొంటే అదే

జె. శ్రీరామమూర్తి

విధంగా వారూ పరిశోధించి ముందుగా ఫలితాలు పొందితే! నా పరిశోధనలు, నాజీవితం, నాసర్వ స్వము నాశనమవుతాయి.'' అతను వూపిరి పీల్చు కున్నాడు.

నేను వుత్సాహంగా, కుతూహలంగా, అతని కథ వినసాగాను.

చాపమీద జీవితంతో, వీధిలైటు కింది చదువుతో నా పరిశోధనలు ప్రారంభమయాయి. నాదగ్గరి వెయ్యి రూపాయలు కర్పూరంలా హరించుకుపోయాయి. నా తిండికోసం పిల్లలకు ఇంగ్లీషు ప్రైవేట్లు చెప్పసాగాను. అలా వచ్చిన డబ్బు ఒకపూట తిండికే అలా అలా సరి పోతోంది.

''కానీ — కష్టేఫలీ: అన్నారు. నాప్రయత్నాలు ఫలించాయి'' చెమట వచ్చిందేమోనని, మోనని, చెమట తుడుచుకున్నాడు. నేను అతని ఫలితాలకోసం ఎదురు చూడసాగాను. అతని చరిత్ర నాకు చాలా ఇంటరెస్టింగుగా వుంది.

''ఎంత ఉష్ణోగ్రతలో, ఎంత పదార్థంలో ఎంత రాక్షసిబొగ్గు వేస్తే వజ్రాలుగా రూపొందుతుందో, ఆసూత్రాలు నాకు అవగాహనమయింది'' అతనికళ్ళు ఆశగా మిలమిలా మెరిసాయి. ''ఒక చిన్న ఇనుపగొట్టంలో తుపాకిమందు కూరి దాన్లో కొన్ని రాక్షసిబొగ్గు ముక్కలు పెట్టాను. ఒక చిన్నమూసలోఇనుము ఒక ఉష్ణోగ్రతవరకు ద్రవమయేట్లు చూసి, ఈ గొట్టాల్ని అందులో వుంచి, కొంతసేపటికి దానికి నిప్పంటించాను. ఆమందు ముట్టుకుంది. పెద్దశబ్దం వచ్చింది. మూస చెక్కలయింది. ఆముక్కల్లో ఒకటి విపరీతమయిన వేగంతో నాచేతికి కొట్టుకుంది.'' అతను కుడిచేతిని నాకు చూపించాడు. దాని మీద పెద్ద మచ్చవుంది.

మళ్ళా మొదలుపెట్టాడు. ''ఎలాగయితేనేం, నా పరిశోధనలు, నావూహలు నిజమయాయి. ఆబొగ్గులు, వజ్రాలుగా మారాయి. కానీ ఆ ప్రేలుడులో పొడిపొడి అయిపోయాయి. ఆపరిశోధనవల్ల నాకు క్షీణించే వుత్సాహం, ఒక్కసారి పెరిగింది.'' అతని కళ్ళు కొంచెం మూత పడ్డాయి.

తరువాత రెండోసారి పరిశోధనకు సామగ్రిని కూర్చుకోవడంలో నాకు చాలా కష్టమయింది. ఒక కమ్మరివాణ్ణి అడిగి, వాడి సహాయంతో ఒక ఉష్ణోగ్రత, పీడనం కల్పించాను. పెద్ద స్టీలు గొట్టంలో చాలా రాక్షసిబొగ్గు వేసి తుపాకిమందు నింపి, దానిని ఆ ఉష్ణోగ్రతలో కొంత వరకుంచాను. చివరికి ఆ తుపాకి మందుకు నిప్పు అంటించాను—''

నేను ఆశ్చర్యంగా చూశాను. ''అయితే ఈసారి కలకత్తానే ప్రేల్చేద్దామనుకున్నారు? అంత స్టీలుగొట్టం నిండా తుపాకి మందుకు నిప్పంటించి''.

అతను నవ్వాడు. ''లేదు. స్టీలు గొట్టం బలమయింది. కావడం మూలాన లది పగలదు. లోపలే కల్లోలం చెలరేగుతుంది' కొంతసేపటికి బయటకు తీశాను. కానీ —'' అతను ఆగాడు.

''ఏమిటి?'' నేను ప్రశ్నించాను.

''ఆలా వజ్రాల తయారీలో చాలాకాలం చల్లారనిస్తే, మంచి ఫలితాలు వస్తాయి. అందుకని ఆగొట్టాన్ని డిగ్రీమీద డిగ్రీ ఉష్ణోగ్రత తగ్గించుతూ వచ్చాను. కొన్ని రోజులకు ఆఉష్ణోగ్రత కల్పించడానికి కావలసిన బొగ్గులు అయిపోయాయి.

'ఏం చేయగలను. తిండికే ఇబ్బందిగావున్న రోజులవి. కొన్ని రోజులు రిక్షాలాగాను.—'' చివరికి రిక్షాకూడా యివ్వను పొమ్మన్నాడు యజమాని. మరికొన్ని రోజులు ఇస్త్రీషాపులో ఇస్త్రీ చేసేవానిగా కుదిరాను. ఇంక ఏం కూలి దొరక్క, నాప్రయత్నాలు విఫలమవుతాయని మూటలు మోసాను. అయినా నా జీవితభృత్యం చాలడం లేదు. చివరకు కొన్నిరోజులు బిచ్చమెత్తాను. అతను ఆవేశంగా అరిచాడు. ''కానీ బిచ్చమెత్తింది బొగ్గుల కెలా సరిపోతుంది. ఎవరో దయామయురాలు నాకు అర్ధరూపాయి దానం ఇచ్చింది. అది పరిశోధన ఆఖరి రోజు. ఆరోజు దాన్ని వేడిచేసి చల్లారిస్తే,నాకు అమూల్యమయిన వజ్రాలు వస్తాయి. నేను ఇంటికి వెళ్ళి, చివరి బోరి, ఆగొట్టాన్ని వేడిచేసి, క్రిందికి దింపి— చిన్నరాయితోదానిముఖాన్నిపగలగొట్టి లోపలకరిగి ముద్దగా వున్న పదార్థాన్ని బయటికితీసి దాన్ని మెల్లగా నేల మీద పగల గొట్టాను. అతను గొంతు స్థాయి తగ్గింది.'' అందులో ఆరుపెద్ద వజ్రాలు, నాలుగు చిన్నవి వున్నాయి. నాజీవిత యత్నం ఫలించింది. నాదరిద్రం ఈరోజుతో తీరి పోతుంది. ప్రపంచానికలా లక్షాధికారినవుతాను. నా ఆశలు అలా వున్నాయి. కానీ —

''అతను విషాదంగా వుచ్చరించాడు. అసలు కష్టాలు ఆరోజుతోనే మొదలయాయి. వజ్రాలను నేను బయటకు తీసి పరీక్షిస్తుండగా ఎవరో అతను నాగది దగ్గర నుంచున్నాడు. నేను తల ఎత్తి చూశాను. ''ఏం కావాలని ప్రశ్నించాను.'' అతనేంసమాధానంచెప్పకుండాక్రూరంగానవ్వాడు ''టెర్రరిస్టు వన్నమాట. అందుకనే కాబోలు రెండుసార్లు బాంబు తయారీ ప్రేలుడులు విని పించాయి. పోలీసులకు ఫోను చేశాను.''అంటూ తన పిడికిలి చూపించాడు.

''నాకు ముచ్చెమటలు పోశాయి. పోలీసులకు నేను టెర్రరిస్టు కాననీ, ఆప్రేలుళ్ళు నా పరిశోధనలకు సంబంధించినవనీ చెప్పితే,నా పరశోధన వివరాలు అందరికీ తెలుస్తాయి.అప్పుడు వజ్రాలు విలువ బొగ్గుల విలువతో సమాన మవుతుంది. లేక చెప్పకపోయామా— జీవిత మంతా జైల్లో వుండాల్సి వస్తుంది. ఆలస్యానికి తావులేదు. దూరంగా పోలీసు సైరన్— విని పిస్తోంది. అతని ముఖం వికసిస్తోంది.

''నాకు ఏం చేయడానికి తోచక, సుత్తితో లతని తలమీద ఒక్క పెట్టు పెట్టి,ఆవజ్రాలు నాపెట్టె తీసుకుని పరుగు పెట్టాను.

''ఆవజ్రాలలో ఒక దాన్ని తీసుకుని ఒకగొప్ప వజ్రాల షాపుకు వెళ్ళి అమ్మజూపాను. వజ్రాన్ని పరీక్షిస్తానని లోపలకి తీసుకెళ్ళి, గుమాస్తాతో పోలీసులకు ఫోనుచేయమని చెబుతున్నాడు. నాకు భయంవేసి వజ్రమయినా తిరిగి తీసుకోకుండా అలాగే షాపు వదలి వచ్చేశాను. అలా రెండు సార్లు జరిగింది.'' అతను వూపిరి పీల్చుకున్నాడు.

'' అన్యాయానికి అన్యాయమే న్యాయం అని దొంగ వస్తువులు కొనే వర్తకునికి ఒక వజ్రం అమ్మ జూపాను. ఆవజ్రం తిరిగి ఇవ్వకుండా. ఇంకా మాట్లాడితే పోలీసులకు ఫోను చేసి ప్రాపిక్యూట్ చేయిస్తానని బెదిరించాడు.

''ఇన్ని అమూల్యమయిన వజ్రాలున్నా నాకు మాత్రం శాంతి లేక పోయింది. చాలా మంది నన్ను మోసం చేశారు. చివరకు నీ మొహంచూసి అడుగుతున్నాను. నీవు నమ్మకస్థుడవని వెయ్యిరూపాయలకు ఈ పెద్ద వజ్రాన్నిస్తాను.'' అన్నాడు.

నాకు ఇరకాటంలో పడ్డట్టనిపించింది. ''ఇలాంటి పరిస్థితులలో నీదగ్గర వజ్రం కొనడమనేది అసంభవం. ఇక—నేనెప్పుడూ నా దగ్గర వెయ్యి రూపాయలు పెట్టుకొని వుండను. కావాలంటే రేపు నా ఇంటికిరా— అన్నాను.

రోడ్డును క్రాస్ చేసి అలా చీకట్లో కలిసి పోయాడు.

కొంత సేపటికి నేను ఆలోచిస్తూ లేచి పోయాను.

అతను నిజంగా వజ్రాల తయారీలో తన శకం సృష్టించిన వాడేమో!

లేక — వట్టి మాటకారా!

ఆదే నేనతన్ని బ్రతికుండగా కడసారి చూడ్డం!

మరుసటి రోజు అతను రాలేదు కొన్ని రోజుల తర్వాత కొన్ని వుత్తరాలు వచ్చాయి. డబ్బు పంపితే వజ్రం పంపుతానని, ఈక్రింది అడ్రసుకు డబ్బు పంపాలని, చెక్కులు పంపకూడదని, కరెన్సీ నోట్లుగా పంపాలని వుత్తరాలు వచ్చాయి.

తరువాత కొన్ని రోజులకు నేను లేని సమయంలో ఒకసారి వచ్చాడట. విపరీతంగా దగ్గుతున్నాడట! క్షయ అని అనుమానమట!

* * *

ఆరోజు ఇంటి కొచ్చేసరికి కొంత మంది ఇంటి దగ్గర మూగి వున్నారు. గబగబా దగ్గర కెళ్ళాను—ఆ వ్యక్తి వాకిట ముందు చచ్చి పడి వున్నాడు. క్షయ కాబోలు ముదిరి, రక్తం కక్కి చనిపోయాడు. అతని కళ్ళు. మాసినగడ్డం చూసేసరికినాకు విపరీతమయిన దుఃఖం వచ్చింది.

నెమ్మదిగా అతని లోపలి జేబులో నుంచి ఆతోలు సంచి తీసుకున్నాను! చివరకు పోలీసుల కప్పగించాను ఆ సంచిని!

అయితే—వజ్రాల కృత్రిమ తయారీలో కొత్తశకం ప్రారంభించకుండా ఆటంకంపెట్టిన వారిలో నేను కూడా ఒక్కణ్ణా!

★